# కూరల బేరం

కూర ఏదైనా కొనుక్కుందామని బజారు కెళ్ళాను. ఏం కూర కొనేది ?

ఏది చూచినా మండిపోతున్నది. మూడు పావలాలు పెడితే కాని ఒక వీసెడు రాదు ఏ కూర అయినా సరే !

పూర్వం అర్ధపావలా, మహాఅయితే పావలా !

కరువుబత్యంకూడా తగ్గిస్తిరి అధికారులు! ఏం కొనేది!

ఏమీతోచక ఇటూ అటూ తిరుగుతూ జేబులో ఉన్న చిల్లరడబ్బులు లెక్కజూచుకుంటూ కాలం గడుపుతున్నాను.

చిన్నప్పుడు ఒక కథ చదివాను ఒక డబ్బుల సంచిని గురించి, ఆ సంచీ తెరిచినప్పుడల్లా అందులో ఒక శతమానం కనపడేదని. అల్లాంటిది ఒకటి మనకు ఎవరైనా ఇస్తే బాగుండు.

బంగారు నాణాలు ఇచ్చేదే కావాలని నే నేమీ, ఏడవటంలేదు. తెరిచినప్పుడల్లా ఒక పావలా ఇస్తే చాలు. అది ఆశాపాతంగా ఉందంటే, అది అక్కర లేదు. రోజుకు కూరకు సరిపోయే డబ్బులు అందులో కనపడితే చాలు.

అంత ఇబ్బందిగా ఉన్నది ఈ రోజుల్లో !

ఇంతలో ఒక కొట్టు ఆసామీ 'వంకాయ మూడు అణాలు' అని కేక వేశాడు.

అందరూ వంకాయలు వీసె పదిఅణాల చొప్పున అమ్ముతూ ఉంటే ఈ అబ్బాయి మూడు అణాలకే ఎందుకిస్తాడు.

అవేవో పుచ్చు వంకాయలు అయిఉంటై. పోనీ పుచ్చులు తీసి వేసి వండుకోవచ్చు. పోయి కొనుక్కుందామనుకొన్నాను.

ఆ కొట్టుదగ్గరకు వెళ్ళి అన్నాను

వీసె ఎంత అన్నావూ ?

ముప్పావలాఅండీ పంతులుగారూ!

ముప్పావలా ? మరి మూడు అణాలేనని కేకవేస్తివి ?

మూడు అణాలు అంటే—సవాశేరు మూడుఅణాలు!

వీసె మూడు అణాలకు ఏ తలకు మాసినవాడు ఇస్తాడండీ పంతులుగారూ ? మీకు ఇంతమాత్రం తెలియదేమండి? అన్నాడు.

ఇదివరలో మా ఆవిడ అనేది నాకు ఏమీ తెలియదని!

ఈ మధ్య మా అమ్మాయికూడా అన్నది. ఇంకేం, వీడుకూడా అన్నాడు. ఇంతమంది తెలిసినవాళ్లు ఉన్న ప్రపంచంలో నేను ఒకణ్ణే తెలియని వాణ్ణిలాగ ఉంది !

అతను అల్లా అన్నా నేనేమీ మాట్లాడక ఒక చిరునవ్వు నవ్వాను. ఒక వీసె తూస్తానండీ అన్నాడు.

వద్దు అన్నట్టు తల తిప్పి, ఒక పావలా అతని చేతిలో పెట్టి సవాశేరూ తూచమన్నాను.

సరిగ్గా పావలాకు వేస్తాను అన్నాడు.

నేను విసుక్కొని సవాశేరు ఇయ్యవయ్యా అన్నాను.

అతడు నావంక ఒక చూపు చూశాడు.

వెధవ సవాశేరు వంకాయలకోసమేనా, ఇంత బేరం చేశావు. ఒక్క పావలా వంకాయలు కొనలేవు ఎందుకయ్యా ఈ మాత్రానికి ఒక పెద్ద సంచీ పుచ్చుకొని బజారుకు వచ్చావు ? అన్నట్లు అనిపించింది.

నన్ను వంకాయలు ఏరనివ్వలేదు. నేను వేరే బేరం చేసుకోవాలెనండీ, మీరు అరగంటసేపు ఏరుతూ కూర్చుంటే నేను త్రాసుబట్టుకొని కూర్చుంటానా ? పట్టండి అని తనకు ఇష్టమొచ్చిన కాయలు తక్కెడలో వేసి తూచాడు. అవన్నీ పుచ్చులో, గట్టిగా రాళ్ళలాగ ఉన్నయ్యో మెత్తగా ఉన్నయ్యో భగవంతుడికే తెలియాలె. తొందరపెట్టి ఆ కాయలు నా సంచిలో కుమ్మరించాడు.

ఆ తరువాత ఆ పక్క కొట్లో చేమదుంపలు కొందామని వెళ్ళాను. సవాశేరు అర్ధపావలా అని కేక వేస్తున్నాడు.

నేను వెళ్ళి వీసె ఎంతకిస్తావని అడిగేసరికి వాడికి పుట్టెడు కోపంవచ్చింది. నావంక చురచురా చూచి "సవాశేరు బేడా అయితే, వీసె ఎంతో మీకు తెలియదా అండీ" అని విసుక్కున్నాడు. నేను తెలియక అడిగానా? వీసెకొంటే ఏమైనా తక్కువకు ఇస్తాడేమోనని నా ఆశ.

అతడు అంత అమర్యాదగా మాట్లాడితే నాకు అస హ్యం వేసింది. వెంటనే ఇంకో దుకాణానికి వెళ్ళిపోయినాను.

అక్కడికెళ్ళి, ఏమయ్యా చేమదుంపలు ఎల్లాగిస్తావు?' అన్నాను. 'తమకు తెలియందేముందండి' పంతులుగారూ, అన్నాడు.

వీడు ఒక్కడు నాకు ఏదో శాస్త్ర తెలుసునని ఒప్పు కొన్నాడు. వీడు శాస్త్ర బుద్ధిమంతుడు అని అనుకొని ఒక అర అరవీసెడు దుంపలు తూచమన్నాను. నేను ఏరుకున్న దాకా ఆగలేదు. గబగబ తూచి నాసంచిలో పోశాడు.

అదేమిటయ్యా ఏరుకోనియ్యవూ? అంటే, తమకు తెలియందేముందండీ బాబూ, మీఒక్కరితోనే కూర్చుంటే ఎల్లాగండీ అన్నాడు.

నాకు ఏదో కొంత తెలుసునంటున్నాడు కాబట్టి నేను సంతోషించి ఊరుకొన్నాను. అవతల కొట్లో చామదుంపలు ఎనిమిది అణాలకు బేరం చేసే వస్తిని. అందుకని అరవీసెకు నాలుగు అణాలు చేతులో పెట్టాను. అతనికి చాలాకోపం వచ్చింది. దిగ్భ్రమింగాడు. "ఇదేమిటండీ పంతులుగారూ, మీకు తెలియనిదేముంది. వీసెపన్నెండు అణాలు!" అన్నాడు. ఇంకా బేరంచేస్తే నీకేమీ తెలియదు అంటాడని మొదలు కుండా ఆరుఅణాలు అతని కిచ్చేశాను.

అక్కడనుంచి మరొక కొట్లోకి పోయినాను ఒక అర వీసెడు బీరకాయలు కొందామని!

ఎట్లా ఇస్తావయ్యా అని అడిగాను.

ప్రొద్దుటినుంచీ వీసె ముప్పావలాకు అమ్మాను. ఇప్పుడేముంది! ఆ వున్న కాస్త సగకూ ఏదో కాడికి ఇచ్చేసి సొమ్ము చేసుకొందామనుకొంటున్నాను. మీ యిష్టం వచ్చినంత ఇయ్యండి అన్నాడు.

మిగిలిపోయిన సరుకు అన్నమాట!

మిగిలిపోయిన సరకూ అంటే, మీ ఉద్దేశం ముదురు కాయ అనుకొన్నారా? బంగారంలాంటి సరుకు! అనినవ్వాడు.

"అబ్బాయీ, నాకు తెలియక అడుగుతాను, బంగారంలాటి సరుకు ఎందుకు మిగులుతుందయ్యా? వచ్చినవాడు ప్రతివాడూ మంచికాయలు ఏరుకొంటాడుగదా! మిగిలినవి ముదురుకాయలన్న మాటేగా?"

నేను యిట్లా అనేసరికి అతడు విరగబడి నవ్వాడు— నేనేదో తెలివితక్కువగా మాట్లాడినట్లు! నవ్వి అన్నాడూ, అదా మీరు అనుకోటం! నాదగ్గరకు వచ్చేవాళ్ళంతా కాస్త గొప్ప ఉద్యోగస్తులు, ఆఫీసర్లు! గొప్పవాళ్ళుకదా అని నేను మంచి లేతకాయలు ఏరి ఇద్దామనిచూస్తే, వాళ్ళు "నీవు వెయ్యి వద్దు, మేమే ఏరుకొంటాము" అంటారు. మాంచి ముదురు కాయలన్నీ జాగ్రత్తగా ఏరుకొని పట్టుకుపోతారు. అవి ముదురుకాయలండీ బాబూ అంటే, వాళ్ళు నమ్మరు. నిజానికి మీరే [illegible] చెప్పండి కూరగాయల [illegible]! అందులో పుట్టి [illegible]లో పెరిగినవాళ్ళకు మాకు తెలియాలె గాని!

ఆ విధంగా ముదురు కాయలన్నీ పోతాయి. సాయింత్రానికల్లా నా దగ్గర లేత వెన్నముద్దల్లాంటి కాయలుంటాయి. సాయింత్రం ఎప్పుడన్నా రండి. మంచి సరుకు దొరుకుతుంది నా దగ్గర అని చెప్పాడు.

అతడు చెప్పిందాంట్లో అబద్ధం నాకు ఎక్కడా కనపడ లేదు.

వీసెడు కాయలు తూచి నా సంచిలో వేశాడు. ఇదొక్కటి నేను చేసిన మంచిబేరం అని సంతోషించాను.

ఆ తరువాత దోసకాయలు అమ్మే చోటుకు వెళ్ళాను. అందులో చాలాభాగము మెత్తగా ఉన్నాయి. మెత్తని కాయలు పనికిరావని మా ఆవిడ నాకు చాలాసార్లు చెప్పింది.

ఏమయ్యా ఇల్లా ఉన్నాయి? అన్నాను.

అతను అన్నాడు పంతులుగారూ ఇవి జగ్గయ్యపేట నక్కదోసకాయలు. ఈ వానలకు కాస్త మెత్తపడ్డమాట నిజమే. కాని కాస్త ఎండకాస్తే మళ్ళీ ఇవి గట్టిపడి రాళ్ళు అవుతయి.

నిజమేనా?

నిజంగాక అబద్ధంచెప్పినదాకా నాకేమి కర్మంచెప్పండి.

అవును వాడికేం కర్మం అబద్ధాలు చెప్పిందాకా అని పించింది.

అతను మళ్ళీ ఇట్లా అన్నాడు: చూడండి పంతులు గారూ, నామాట విని ఇవి తీసుకుపొండి. రేపు మధ్యాహ్నం

చూడండి ఎట్లాగుంటాయో రాళ్ళు పలుగు రాళ్ళు అయి పోతై,

సరేనని ఒక వీసెడు దోసకాయలు తీసుకొన్నాను.

ఇక ఇంటికి వెడదామని బయలుదేరాను.

దీపాలు-జీతాలు చాలక అవస్థపడుతున్న బడిపంతుళ్ళ ముఖాలలాగ ఏడుస్తున్నయి.

ఇంటికి కూరలు తీసికెళ్ళాను. మా ఆవిడ ముందు పోశాను. ఇక వారంరోజులదాకా కూరలు తేనక్కరలేదు, కావలిసినన్ని తెచ్చాను అన్నాను.

ఆవిడ అన్నదీ, మీకో నమస్కారం పెడతా మీరు కూరలు తేబోకండి.

ఏం ?

నా బొంద. ఏం కూరలండీ ఇవ్వి ? బెండకాయలు పెంకులు ! బీరకాయలు—అయ్యో ! ముదురు బొచ్చెలు. వంకాయలు పుచ్చు ? రామ, రామ, మీకు ఇంతమాత్రం తెలియదేమీ అంటూ ! ఇన్నాళ్ళు కాపురం చేసినా ఈ మాత్రం తెలియకపోయె. అయ్యో !

నే నేమీ మాట్లాడలేదు.

ఆవిడ మళ్ళీ అన్నది—ఇవేం దోసకాయలు మొత్త పడ్డవి తెచ్చుకొంటారా ?

ఆ మాత్రం తెలియదటండీ—

నేను అన్నాను కోపంగా—ఆ మాత్రం తెలియక కాదు. ఇవి నక్కదోసకాయలు చౌకగా ఇచ్చాడు.

ఇస్తే ఏమి లాభం ! మెత్తబడి కుళ్ళటానికి సిద్ధంగా ఉండె !

వానలకు మెత్తబడవు కదే ! కాస్త ఎండ కాసిందా అంటే, అవే రాళ్ళు అవుతవి !

ఆవిడ నవ్వి—అయ్యయ్యో, ఎవరండీ మీకు ఈ మాటలు చెప్పింది ! ఎంత టోపీ వేశాడండీ—ఇంత తెలివి తక్కువ మొగుణ్ణి పెట్టుకొని నేను కాపరం చెయ్యలేను బాబూ—అని వెళ్ళి పోయింది.

నాపైన నాకే అసహ్యం వేసింది. కూరలన్నీ నెత్తిని పెట్టుకొని వస్తిని చచ్చి చెడి కూలి పెడితే పావలా అవుతుం దని, గిల్లి గిల్లి బేరం చేస్తిని ! ఛీ—ఒక్క కూరా అక్కరకు రాకపోయె !

ఇక కూరలు తేకూడదని నిశ్చయించు కొన్నాను.

కాని ఆ దోసకాయలు రేపు మధ్యాహ్నానికి మళ్ళ గట్టిపడతయ్యనే ఆశ ఇప్పటికీ పోలేదు.